కార్తీక మాసోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

- ముస్తాబైన కొత్తూరు ఆలయం
- భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక క్యూలైన్లు, షెడ్ల నిర్మాణం
- అన్న ప్రసాదాల పంపిణీ, సులభ దర్శనానికి చర్యలు
- సౌకర్యాల కల్పనపై ఆలయ కమిటీ సమావేశం





సుబ్రమణ్యేశ్వర స్వామి మూలవిరాట్, ఆలయ గాలిగోపురం



కొత్తూరు ఆలయంలో సమావేశమైన అధికారులు, అర్చకులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయానికి కార్తీక మాసంలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చేభక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకొని, ప్రతి భక్తుడికి సులభతర దర్శనం అందించేందుకు దేవస్థాన అధికారులు తగు ప్రణాళికలు రూపొందించారు. ఈఓ రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఆలయంలో కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. కార్తీక మాసం ప్రారంభం కావడంతో ప్రతి రోజు, ప్రతి ఆది, సోమ, మంగళవారాల్లో ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై కార్యాచరణ రూపొందించారు.

తాత్కాలిక క్యూలైన్లు

కొత్తూరు సుబ్రమణేశ్వరుడి దర్శనానికి వచ్చే భక్తులు స్వామి వారిని దర్శంచుకునేందుకు తాత్కాలిక క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నారు. ఆలయ గాలిగోపురం నుంచి పాత గదుల చుట్టూ క్యూలైన్లు కర్రలతో మూడు నాలుగు లైన్లు ఏర్పాటు చేశారు. వీలైనంత త్వరగా భక్తులు స్వామివారి దర్శనం చేసుకునేందుకు గాలిగోపురం నుంచి లోపలికి పంపనున్నారు. అక్కడి నుంచి నాగులకట్టను దర్శించుకొని స్వామి వారిని దర్శించుకునేలా క్యూలైన్ల నిర్మాణం చేపడుతున్నారు.

క్యూలైన్‌లో సౌకర్యాలు

స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులు తాత్కాలిక క్యూలైన్ల ద్వారా వెళ్లాల్సి ఉంటుంది. ఈ క్రమంలో చిన్న పిల్లల తల్లులు, వృద్ధులను త్వరగా దర్శనానికి పంపనున్నారు. అలాగే క్యూలైన్‌లో ఉన్న వారికి మంచినీరు. ఇతర సౌకర్యాలు కల్పించనున్నారు. భక్తులకు దేవస్థాన గదుల పక్కన ఉన్న మరుగుదొడ్లను అందుబాటులోకి తెచ్చారు.

అదనంగా అన్న ప్రసాదాల పంపిణీ

సాధారణంగా ప్రతి ఆదివారం 5 - 8 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. కార్తీక మాసంలోని ఆదివారాల్లో 15-25 వేల మందికి పైగానే భక్తులు స్వామి వారిని దర్శించుకునే అవకాశం ఉంది. ఇక కార్తీక మాసం రెండు, మూడు వారాల్లో భక్తుల సంఖ్య మరింత పెరగనుంది. వీరికి సరిపడా అన్నప్రసాదాలు తయారు చేసేందుకు అదనంగా ఖర్చు చేయనున్నారు. ప్రతి భక్తుడికి మిఠాయి పదార్థం, అన్నం, పప్పు, సాంబారు, మజ్జిగ అందించనున్నారు. ఈ ప్రసాదాలకు కావాల్సిన సరుకులు, వంట సిబ్బంది పనిచేసే సమయం తదితర వాటిపై చర్చించారు.

పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం

వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు వాహనాలను నిలిపేందుకు స్థలం కేటాయింపుపై దేవస్థాన అధికారులు దృష్టి సారించారు. ఇదివరకే కౌలుకు తీసుకున్న పొలంలో ద్విచక్ర వాహనాలు, కార్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు పార్కింగ్ చేసేందుకు స్థలం కేటాయించారు. అలాగే ఆలయ ఆవరణలో భారీ గేట్లు, ఇతర బొమ్మలు, పూలు, టెంకాయల దుకాణాలు ఏర్పాటు చేస్తారు.

ఆలయ అభివృద్ధికి రూ.2 కోట్లు

ఏటా ఆలయానికి పెరుగుతున్న భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సహకారంతో అదనపు షెడ్లు, స్టీల్ పైపులతో క్యూలైన్, విడిది గదులు, తదితర వాటి నిర్మాణం కోసం రూ.2.07 కోట్లు మంజూరు చేయించారు. వీటికి సంబంధించిన పనులు చకచకా జరుగుతున్నాయి. ఈ నిర్మాణం పూర్తయితే భక్తులకు పూర్తిస్థాయి సౌకర్యాలు అందుతాయి. ఎమ్మెల్యే చొరవతో పనులు వేగంగా జరుగుతున్నాయి.

క్లుప్తంగా

సైక్లింగ్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థిని శశిరేఖ

ఓర్వకల్లు: రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లో మీదివేముల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని శశిరేఖ ప్రతిభ కనబరిచారు. పాఠశాల హెచ్ఎం శ్రీనివాసయాదవ్ సోమవారం ఈ విషయం వెల్లడించారు. ఇటీవల అండర్-14 బాలికల విభాగంలో బాపట్లలో సైక్లింగ్ పోటీలు జరిగాయి. ఇందులో శశిరేఖ మూడోస్థానంలో నిలవడంతో ఆ విద్యార్థినితో పాటు పీడీ శేఖర్‌ను హెచ్ఎం, పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

రైతులంతా వివరాలు సమర్పించాలి

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం కోడుమూరును కరువు మండలంగా ప్రకటించిందని రైతులంతా పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ పత్రాలను ఆర్బీకే సిబ్బందికి మంగళవారంలోగా సమర్పించాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలను ఇప్పటికే ఈ-క్రాప్ యాప్‌లో పూర్తిగా నమోదు చేయడం జరిగిందని, పంట నమోదు చేయించుకున్న రైతులకు ఐదెకరాల వరకు ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని ఏఓ వెల్లడించారు.

బస్సుల నిర్వహణపై దృష్టి పెట్టండి

కర్నూలు(రాజ్‌విహార్): బస్సుల ఫెయిల్యూర్‌ను తగ్గించేందుకు నిర్వహణ పనులపై చర్యలు చేపట్టాలని రోడ్డు రవాణా సంస్థ కర్నూలు-2 డిపో మేనేజరు సర్దార్ హుసేన్ సూచించారు. సోమవారం ఆయన గ్యారేజీ మెకానికల్ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా, అవాంతరాలు లేకుండా గమ్య స్థానాలకు చేర్చడమే లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు. బస్సుల నిర్వహణలో లోపం ఉంటే ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు.

రోగులకు అన్నదానం

కర్నూలు కల్చరల్: మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ సేవా సమితి ఆధ్వర్యంలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం విశ్వభారతి హాస్పిటల్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రిలోని రోగులు, వారి అటెండెంట్లకు సుమారు 350 మందికి భోజనం అందించారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షురాలు, తెలుగు ఉపాధ్యాయులు పసుపులేటి నీలిమ మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా తరిగొండ వెంగమాంబ సేవా సమితి ఆధ్వర్యంలో నెలలో ఒక రోజు సుమారు 400 మంది వరకు అన్నదానం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సభ్యులు రత్నమ్మ, యశ్వంత్, జనార్దన్, శ్రీకర్, రేఖ, శివజ్యోతి, మురళీ, కల్యాణ్, లలిత, సాయి లీల, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సామూహిక కేదారేశ్వర వ్రతం

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో అమావాస్యను పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీ కేదారేశ్వర స్వామి వ్రతాన్ని సామూహికంగా నిర్వహించారు. లలితా సంఘం అధ్యక్షుడు తెల్లాకుల జ్ఞానేశ్వరమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి సందేశమిచ్చారు.

ఖనిజ అక్రమ రవాణాను అరికట్టాలి

కర్నూలు (న్యూటౌన్): అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి ఖనిజ అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్లు మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కర్నూలు, నంద్యాల, బనగానపల్లె గనుల శాఖ అధికారులతో నంద్యాల జిల్లా కలెక్టర్ మన్‌జీర్‌జిలానీ శామూన్ సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు చేశారన్నారు. చెక్‌పోస్టుల మరింత బలోపేతం చేయాలని ఆదేశించారన్నారు. ఖనిజ అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవన్నారు. పట్టుబడిన వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఈ విషయంలో సిబ్బంది అలసత్వం వహిస్తే వేటు తప్పదని హెచ్చరించారు.

శాంతిరాంలో ఏఐఎంఎల్ ఏర్పాటు

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగంలో కొత్తగా ఏఐఎంఎల్ కోర్సును ఏర్పాటు చేసినట్లు హెచ్ఓడీ రమాదేవి సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ కొత్తగా కళాశాలకు వచ్చే విద్యార్థులకు ఏఐఎంఎల్ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మిషన్ లెర్నింగ్) ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఈ కోర్సును ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం కొత్తగా కళాశాలకు వచ్చిన విద్యార్థులకు వెల్‌కమ్ పార్టీని ఏర్పాటు చేశారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. హెచ్ఓడీలు శేషయ్య, ఫరూక్, వీరేష్, మల్లికార్జున రెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

సహకార వారోత్సవాలకు రంగం సిద్ధం

కర్నూలు(అగ్రికల్చర్): నేటి నుంచి జిల్లాలో అఖిల భారత సహకార వారోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఈ ఉత్సవాలను వారం రోజుల పాటు పెద్ద ఎత్తున నిర్వహించేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. మంగళవారం డీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి సహకార పతాకాన్ని ఆవిష్కరించి సహకార వారోత్సవాలను ప్రారంభిస్తారు. భారత దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా... సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో సహకార సంఘాల పాత్ర అనే థీమ్‌తో సహకార వారోత్సవాలు నిర్వహించనున్నారు. గత ఏడాది సంఘాల్లో జరిగిన అభివృద్ధిని సమీక్షించనున్నారు.

ఈ రోజు

చింతమానుపల్లెలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

సి.బెళగల్: సి.బెళగల్ మండల పరిధిలోని చింతమానుపల్లె గ్రామలో మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసి రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ సచివాలయంలో సాయంత్రం 4:30 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ఉంటుందని, ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరవుతారని తెలిపారు. గ్రామ ప్రజలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కోడుమూరులో..

కోడుమూరు రూరల్: కోడుమూరులోని గ్రామ సచివాలయం-3లో మంగళవారం మధ్యాహ్నం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ విచ్చేస్తున్నారని, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పక పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

పసుపలలో వై నీడ్స్ ఏపీ జగన్

కర్నూలు సిటీ: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం కర్నూలు మండల పరిధిలోని పసుపల గ్రామంలో నిర్వహించనున్నారు. కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ పాల్గొననున్నారు. మొదటగా గార్గేయపురంలోని సచివాలయం-2 పరిధిలో గడప గడపకు మన ప్ర భుత్వం కార్యక్రమం జరుగుతుంది.

పెసరవాయిలో గడప గడపకు..

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి గ్రా మంలో మంగళవారం గడప గడపకు మన ప్రభు త్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలు గురించి వివరిస్తారన్నారు. అలాగే గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తారని చెప్పారు.

గ్రంథాలయ వారోత్సవాలు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు, ఓర్వకల్లు శాఖ గ్రంథాలయాల్లో మంగళవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. 14న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 15న పుస్తక ప్రదర్శన, డ్రగ్స్‌పై అవగాహన, పుస్తక పఠనం ప్రాముఖ్యతపై అవగాహన ఉంటుంది. 16న స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు, ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయి. 18న స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న వారిపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహిస్తారు. 19న దిశ చట్టం, మహిళా సాధికారతపై అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. చివరగా 20వ తేదీన అక్షరాస్యత దినోత్సవం, డిజిటల్ లైబ్రరీల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయా శాఖల గ్రంథాలయాధికారులు హనుమేనాయక్, కౌసల్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ కోత

పాణ్యం: మండల పరిధిలోని పాణ్యం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు మంగళవారం విద్యుత్ అంతరాయం కలగనున్నట్లు ఏఈ డి. పుల్లయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సేవలను నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

మండల సర్వసభ్య సమావేశం

కల్లూరు: ఎంపీపీ బోయ శారద అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీవీ రమణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ భవనంలో జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సింగిల్ విండో చైర్మన్లు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని తెలిపారు.

ప్రాథమిక పాఠశాలల్లో క్రీడాపోటీలు

పాణ్యం: మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలలో 3-5 తరగతులు చదువుతున్న బాలబాలికలకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం తెలిపా రు.వారు సోమవారం మాట్లాడుతూ.. 14వ తేదీన బాలల దినోత్సవం పురస్కరించుకొని ఉదయం 9 గంటలకు ఈ క్రీడలు ప్రారంభిస్తామన్నారు. కబడ్డీ, టగ్‌ఆఫ్‌వార్, ఖోఖో, రన్నింగ్, లాంగ్‌జంప్‌తో తదితర క్రీడాంశాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించనున్నట్లు చె ప్పారు.

జన చైతన్య యాత్రను విజయవంతం చేయాలి



'జగనన్న జనచైతన్య యాత్ర'ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: వైఎస్సార్‌సీపీ నాయకుడు తొగురు ధర్మరాజు, సుకుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన 'జగనన్న జన చైతన్య యాత్ర'ను విజయవంతం చేయాలని పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు,పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఎమ్మెల్యే స్వగృహం వద్ద గ్రాస్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్, ప్రెసిడెంట్ తొగురు ధర్మరాజు, సుకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యాత్ర వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న 99 శాతం హామీలను నెరవేర్చారని వివరించారు. జగనన్న జనచైతన్య యాత్ర పేరుతో ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేసేలా ప్రత్యేకంగా వాహనాన్ని తయారు చేసుకున్న నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. ప్రభుత్వం చేస్తున్న మంచి ప్రజలకు తెలియజేయకుండా టీడీపీ చేస్తున్న తప్పుడు ఆరోపణలను మాత్రమే ఎల్లో మీడియా ప్రచారం చేస్తోందని విమర్శించారు.

నిజం ప్రజలకు తెలియాలి

యాత్ర నిర్వాహకులు తొగురు ధర్మరాజు మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక జీఓ తీసుకొచ్చి 50 మంది కన్నా తక్కువ విద్యార్థులు ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టల్స్ మూసివేసి రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని మోసపూరిత హామీ ఇచ్చి మూడు దశల్లో రాష్ట్ర వ్యాప్తంగా 633 సాంఘిక సంక్షేమ హాస్టళ్లను మూసివేసిందన్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 130 హాస్టళ్ల మూసివేసి అమరావతి ప్రాంతంల్లో ఎస్సీ కులాల మనుగడ ఉండకుండా పథకం ప్రకారం విషపూరిత కుట్రలు చేసిందన్నారు. 21వ వార్డు నాయకులు సుకుమార్, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

సి.బెళగల్: మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో దాడులు నిర్వహించి అక్రమ మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మన్మథవిజయ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. బురాన్‌దొడ్డి గ్రామంలో సోమవారం గ్రామంలో అక్రమ మద్యం అమ్మకాలపై సమాచారం అందడంతో పోలీస్ సిబ్బంది సోదాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన బోయ గోవిందు వద్ద కర్ణాటక రాష్ట్రానికి చెందిన 45 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు. మద్యం ప్యాకెట్లను సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ఓర్వకల్లు: మండలంలోని కన్నమడకల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అప్పుల బాధ తాళలేక ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..గ్రామానికి చెందిన బోయమహేష్ (38)కు 1.50 ఎకరాల సొంత భూమి ఉంది. అదనంగా మరో 7 ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగుచేశాడు. అయితే వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు సరిగా పండలేదు. దీంతో పంటల కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఈ నెల 12వ తేదీన ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారస్థితి లో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు.

క్రైం కార్నర్

మృతదేహం లభ్యం

కర్నూలు (టౌన్) : ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జొహరాపురానికి చెందిన రామకృష్ణ (41) అనే వ్యక్తి కేసీ కెనాల్‌లో పడి మృతిచెందాడు. ఈనెల 11న ఆయన శివమాల వేసుకుని వినాయక ఘాట్ వద్ద స్నానానికి దిగి నీటిలో కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని కెనాల్ వెంట వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం జొహరాపురం సమీపంలో మృతదేహం బయటపడటంతో పోలీసులు స్వాధీనం చేసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ బలవన్మరణం

కర్నూలు (టౌన్) : నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కల్లూరులో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. రాఘవేంద్ర నగర్‌లో షారుక్, జహీర్ ఖాతూన్ దంపతులు నివసిస్తున్నారు. వీరికి పిల్లలు లేరు. బతుకుదెరువు కోసం వేరే ప్రాంతం నుంచి ఇక్కడికి వచ్చి చిన్నాచితక పనులు చేసుకుంటున్నారు. అయితే, తరచూ భార్యాభర్త గొడవ పడేవారని ఇరుగుపొరుగు వారు పోలీసులకు తెలిపారు. సోమవారం మరోసారి ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఉదయం షారుక్ టిఫిన్ తీసుకువచ్చేందుకు బయటకు వెళ్లాడు. అదే సమయంలో ఇంట్లో ఉన్న ఆమె ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు భర్త పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

వ్యక్తికి గాయాలు

పాణ్యం : మండల పరిధిలోని నూలు మిల్లు వద్ద జాతీయ రహదారిపై సోమవారం వెలుగోడుకు చెందిన సుబ్బయ్య బైక్‌పై వెళ్తూ కిందపడ్డాడు. ఈ ఘటనలో గాయపడిన ఆయనను హైవే పెట్రోల్ సిబ్బంది చికిత్స నిమిత్తం శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

ఎంఈఓ రామక్రిష్ణుడు మృతి

గడివేముల: అనారోగ్యంతో ఎంఈఓ రామక్రిష్ణుడు సోమవారం ఉదయం మృతిచెందాడు.ఈయన నంద్యాల జిల్లా బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ, గడివేముల ఎంఈఓగా జూలై 6 వరకు అదనపు బాధ్యతలు నిర్వహించారు. తర్వాత అనారోగ్య కారణాలతో మెడికల్ లీవ్‌లో వెళ్లాడు. ఈ క్రమంలో సోమవారం ఇంటి వద్ద హఠాన్మరణం పొందాడు. ఎంఈఓ-2 విమలా వసుంధరదేవితో పాటు పలువురు ఉపాధ్యాయులు రామకృష్ణుడు మృతికి సంతాపం తెలిపారు. వారోత్సవాల ముఖ్య ఉద్దేశం.

వేధిస్తోన్న తియ్యని రోగం!

- పెరిగిపోతున్న చక్కెర వ్యాధి బాధితులు
- పట్టణాల్లో 20 శాతం, గ్రామాల్లో 15శాతం మంది బాధితులు
- మారిన జీవనశైలి, వంశపారంపర్యం, మానసిక ఒత్తిళ్లే కారణం
- కోవిడ్ తర్వాత పెరిగిన కేసులు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా చికిత్స
- నేడు ప్రపంచ డయాబెటీస్ దినోత్సవం

ఒకప్పుడు ఫలానా వ్యక్తికి షుగర్ (చక్కెర) వ్యాధి వచ్చిందంట అని చెప్పుకునేవారు. కానీ ఇప్పుడు ఈయనకు కూడా షుగర్ వచ్చిందా అని మాట్లాడుకుంటున్నారు. షుగర్ జబ్బు ఇప్పుడు సాధారణమైంది. ప్రతి నలుగురిలో ఒకరు ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ఒకప్పుడు దయాబెటీస్ వ్యాధి (షుగర్) పట్టణ వాసుల్లోనే అధికంగా కనిపించేది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోని వారిలోనూ ఈ వ్యాధి అధికమవుతోంది. మారిన ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిళ్లు, జీవనశైలిలో మార్పుల వల్ల ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. ఈ నెల 14వ వరల్డ్ దయాబెటీస్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

కర్నూలు(హాస్పిటల్): ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించిన ఇంటింటి సర్వేలో పట్టణ ప్రాంతాల్లో 20 శాతం గ్రామీణ ప్రాంతాల్లో 15 శాతం మంది మధుమేహం రోగులున్నట్లు తేలింది. ఈ రోగం ఉందన్న విషయం తెలియని వారు మరో 25 శాతం మంది ఉండే అవకాశం ఉందని వైద్యులు భావిస్తున్నారు. ఏదైనా అనారోగ్య సమస్య వచ్చినప్పుడు చేసిన రక్తపరీక్షల్లో ఎక్కువ శాతం మందికి చక్కెర వ్యాధి బయటపడుతోంది. ఇలా జిల్లాలో ప్రీ డయాబెటీస్‌తో బాధపడుతున్న వారు మరో 15 శాతం మంది ఉన్నట్లు వైద్యులు అంచనా వేస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎండోక్రైనాలజి విభాగంలో ప్రతి మంగళ, శుక్రవారాలు ఓపీ చికిత్స చేస్తారు. ప్రతి ఓపీకి 200 మంది చికిత్సకు రాగా అందులో వంద మందికి ఇన్సులిన్‌ను ఉచితంగా అందజేస్తున్నారు. మొత్తం ఓపీలో 80 శాతం మంది షుగర్ రోగులే ఉండటం గమనార్హం. ప్రైవేటు ఆసుపత్రుల్లోని ఎండోక్రైనాలజిస్టులు, జనరల్ ఫిజీషియన్ల వద్దకు సైతం ప్రతి యేటా 16 వేల మంది చికిత్స కోసం వస్తున్నట్లు అంచనా.

దయాబెటీస్ రకాలు

టైప్ 1 దయాబెటీస్ : శరీరం అతి తక్కువ ఇన్సులిన్‌ను తయారు చేస్తుంది. ఈ రకం మధుమేహం గల వ్యక్తులు ఇన్సులిన్‌ను విధిగా తీసుకోవాలి. లేకపోతే ప్రాణాంతకమైన డీకేఏ అనే పరిస్థితిలోకి జారుకుంటారు. ఇది చాలా మందికి పుట్టుకతోనే వస్తుంది.

లక్షణాలు

ఇందులో అధిక దాహం, ఎక్కువ మూత్ర విసర్జన, ఎక్కువ ఆకలి, హటాత్తుగా బరువు తగ్గిపోవడం, అలసట వంటి లక్షణాలు ఉంటాయి.

టైప్ 2 దయాబెటీస్

శరీరానికి తగినంత ఇన్సులిన్ ఉత్పత్తి కాదు. సాధారణంగా 40 ఏళ్ల వయస్సు దాటిన వారికి ఈ సమస్య ప్రారంభం అవుతుంది. స్థూలకాయం, మానసిక ఒత్తిళ్లు, ఆహారపు అలవాట్లు దీనికి కారణాలు.

లక్షణాలు

ముందుగా ఎలాంటి లక్షణాలు కనిపించవు. తర్వాత తీవ్ర అలసట, చేతులు, కాళ్లలో తిమ్మిరి, మొద్దుబారడం, తరచూ మూత్రవిసర్జన, లైంగిక అసమ ర్థత, గాయాలు త్వరగా మానకపోవడం, అతిగా ఆకలి, అతిగా దాహం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ఈ పరీక్షలు చేయించాలి

- షుగర్ పేషెంట్లు రక్తంలో షుగర్ స్థాయిని తెలుసుకునే పరీక్ష నెలకొకసారి చేయించాలి.
- సంవత్సరానికి ఒకసారి మూత్రపిండాల పనితనం (బ్లడ్ యూరియా, క్రియాటినిన్) చేయించాలి.
- ఆరు నెలలకోసారి రక్తంలోని కొవ్వుశాతం చేయించుకోవాలి.



- మూడు నెలలకోసారి హెచ్‌బీఏ1సీ చేయించుకోవడం మంచిది.

తెల్లని పదార్థాలకు దూరంగా ఉండాలి

తెల్లగా కనిపించే ఆహార పదార్థాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని వైద్యులు సూచిస్తున్నా రు. చక్కెర, పిండి పదార్థాలు, తెల్లగా కనిపించే నూ నెలు, మైదాతో చేసిన పదార్థాలు, జంక్‌ఫుడ్ లాంటివి మానేయాలి. దానికి బదులుగా ఆకుకూరలు, పండ్లను రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలి.

రోజూ వ్యాయామం తప్పనిసరి

ప్రతిరోజూ అరగంట వాకింగ్‌తో మధుమేహం నియంత్రణలోకి వస్తుందని వైద్యులు చెబుతున్నా రు. దీంతో పాటు యోగా, ప్రాణాయామం, ధ్యానం సైతం ఎంతో మేలు చేస్తాయి. వ్యాయామం వల్ల గుండెపోటు, గుండెకవాటాల వ్యాధుల ముప్పు తగ్గి టైప్-2 మధుమేహంతో బాధపడే వారికి మేలు చేస్తుంది.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా సేవలు

జిల్లాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు ఆదోనిలోని ఏరియా ఆసుపత్రి, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, అర్బన్‌హెల్త్ సెంటర్లలో షుగర్ వ్యాధికి అవసరమైన షుగర్, లిపిడ్ ప్రొఫైల్, ఆర్ఎఫ్‌టీ పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేస్తోంది. ప్రస్తుతం షుగర్ ఉన్న వారికి ఉచితంగా చికిత్స, మందులు అందజేస్తున్నారు.

కోవిడ్ తర్వాత పెరిగిన కేసులు

కోవిడ్-19 ప్రపంచాన్ని అతలాకుతలం చేయడమే గాక ఇప్పటికీ దాని తాలూకు నష్టం వెంటాడుతూనే ఉంది. ఇందులో ముందుగా షుగర్‌వ్యాధి మొదటి వరుసలో ఉంది. ఇప్పటికే షుగర్ ఉన్న వారికి కోవిడ్ తర్వాత షుగర్ లెవెల్స్ పెరగగా, కొత్తగా షుగర్ రోగుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. కోవిడ్ సమయంలో స్టెరాయిడ్స్, యాంటిబయాటిక్స్, ఇతర ఔషధాలు అధికంగా వాడటంతో పాటు అధికంగా మాంసాహారం, కొవ్వు పదార్థాలు తీసుకోవడం, వ్యాయామం చేయకపోవడం వంటి కారణాల వల్ల షుగర్ కేసులు పెరిగినట్లు వైద్యులు చెబుతున్నారు.

ప్రీ డయాబెటీస్ రోగుల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది



ఇటీవల ప్రీ డయాబెటీస్ రోగుల సంఖ్య 15 శాతం ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇది ఆందోళనకర విషయం. పరిస్థితి మారకపోతే భవిష్యత్‌లో దేశ జనాభాలో సగం మంది షుగర్‌బారిన పడే అవకాశాలు ఉన్నట్లు ఈ గణాంకాలను బట్టి అర్థం అవుతోంది. ఇది అటు దేశ, ఇటు కుటుంబ ఆర్థిక, ఆరోగ్యానికి తీవ్ర నష్టం చేకూరుస్తుంది. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేయాల్సి ఉంది.

–డాక్టర్ పి. శ్రీనివాసులు, ఎండోక్రైనాలజి హెచ్ఓడీ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

డయాలసిస్ రోగుల్లో 60 శాతం షుగర్ రోగులే...!



ప్రస్తుతం డయాలసిస్ చేయించుకుంటున్న వారిలో 50 నుంచి 60 శాతం షుగర్ రోగులే ఉంటున్నారు. దీనిని బట్టి కిడ్నీలపై షుగర్ ఎలాంటి ప్రభావం చూపుతుందో అర్థం అవుతుంది. మూత్రంలో ప్రొటీన్ ఎక్కువగా పోతుంటే జాగ్రత్త పడాలి. ఇందుకోసం ఇప్పటికే షుగర్ ఉన్న వారు నెలకోసారి మూత్రపరీక్ష చేయించుకోవాలి. ముందుజాగ్రత్తగా షుగర్, బీపీని నియంత్రణలో ఉంచుకోవాలి.

–డాక్టర్ పీఎల్. వెంకట పక్కిరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, నెఫ్రాలజి విభాగం, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

ప్రభుత్వ ఖాజీకి పీహెచ్‌డీలో గోల్డ్‌మెడల్



గోల్డ్ మెడల్‌ను అందుకుంటున్న ప్రభుత్వ ఖాజీ ముఫ్తి అబాదాస్ సలాం కౌసర్

కర్నూలు సిటీ: నగరానికి చెందిన ప్రభుత్వ ఖాజీ డా.ఎండీ ముఫ్తి అబాదాస్ సలాం కౌసర్ పీహెచ్‌డీలో గోల్డ్‌మెడల్ సాధించారు. ఈయన తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్‌కు చెందిన శాతవాహన యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేశాడు. స్వాతంత్ర సమరయోధుల గురించి పుస్తకాన్ని ఉర్దూలో రాయడంతో ఈ అవార్డు దక్కినట్లు ఖాజీ తెలిపారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల హైదరాబాద్‌లో మదిన ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండర్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ ముస్లిం ప్రొఫెషనల్ అధ్యక్షుడు అమీర్ ఇద్రుసి తనకు గోల్డ్ మెడల్ అందించినట్లు వెల్లడించారు.

తైక్వాండోలో రాణించాలి

కర్నూలు (టౌన్) : చిన్నారులు తైక్వాండో క్రీడలో రాణించాలని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు నగరూర్ రాఘవేంద్ర అన్నారు. సోమవారం స్థానిక నరసింహారెడ్డినగర్‌లోని తన నివాసంలో చిన్నారులకు తైక్వాండో కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ ద్వారా ఆరోగ్యం, వ్యక్తిగత క్రమశిక్షణ, మానసిక ధైర్యం అలవడుతుందన్నారు. వాసవీ క్లబ్ తరపున క్రీడాకారులకు సహకారం అందిస్తామన్నారు.